సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



ఉత్సాహంగా సాక్షి మ్యాథ్స్-బీ

అనంతపురం నగరంలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం సాక్షి ఆధ్వర్యంలో మ్యాథ్స్-బీ పోటీలు ఉత్సాహంగా సాగాయి.

8లో



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

32.2°/ 19.5°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.. ఉదయం చలి కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో 2.37 టీఎంసీల నీరు



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తి బంద్ అయ్యింది. డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంతపురం , శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజూ సుమారు 60 క్యూసెక్కులు, లీకేజీలు, ఇతరత్ర కింద 110 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ఆదివారం నాటికి జలాశయంలో 2.37 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. ఇన్‌ఫ్లో బంద్ అయినప్పటికీ తాగునీటి ప్రాజెక్టులకు నీటి కొరతేమీ ఉండదన్నారు. 1.5 టీ ఎంసీల నీరు నిల్వ ఉన్నా ప్రాజెక్టులకు నీటి సమస్య ఉండదని ఆమె స్పష్టం చేశారు.

రేపు జిల్లాకు కేంద్ర బృందం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. ఐఏఎస్ అధికారి పంకజ్ యాదవ్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులు పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో ఖరీఫ్ పంట నష్టం వివరాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. పరిగి మండలం మోద, యర్రగుంట గ్రామాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటల పరిశీలన అనంతరం మడకశిర మండలంలోని హరేసముద్రం, కదిరేపల్లిలోని వేరుశనగ పొలాలు పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గుడిబండ, మందలపల్లి, అమరాపురం మండలం వలస సమీపంలో వేరుశనగ పంటలు పరిశీలిస్తారని వెల్లడించారు.

డి-ఫార్మసీ మిగులు సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి డి-ఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) కోర్సులో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు పది, ఇంటర్ మార్క్ లిస్టులు, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ, టీసీ ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు తీసుకుని బుధవారం ఉదయం 9.30 గంటలకు కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చు. ఏడాదికి రూ.8లక్షల లోపు ఆదాయం ఉన్న ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌తో హాజరు కావచ్చు. ప్రవేశాలు పొందిన ఓసీ విద్యార్థులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.5,700 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. పూర్తి వివరాలకు 98662 73402, 97038 43680లో సంప్రదించవచ్చు.

పక్కాగా పశు ఆరోగ్యం

- పశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- పాడి రైతులకు మరింత భరోసా
- జీవాలకు హెల్త్ కార్డులు
- జిల్లాలో 1.52 లక్షల మంది రైతులకు అందజేత
- వైద్య సేవలన్నీ పక్కాగా రికార్డు

జిల్లాలో పశుసంపద వివరాలు

పాడి పశువులు 2.25 లక్షలు	గొర్రెలు 26 లక్షలు
ఎనుములు 82 వేలు	మేకలు 4.5 లక్షలు



గ్రామంలోనే పశువుకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు

పుట్టపర్తి అర్బన్: పాడి రైతులకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పశువులకు నాణ్యమైన సేవలు అందించడానికి గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పశు వైద్యులను నియమించారు. జిల్లాలోని 6 నియోజకవర్గాలకు 12 వాహనాలు కేటాయించారు. టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఏ సమయంలో కాల్ చేసినా వైద్యం ముంగిటకే అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే పాడి రైతులకు మరింత మేలు చేకూరేలా హెల్త్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టారు.

ఉపయోగాలెన్నో..

6 ఆవులు, బర్రెలకు ఒకటి చొప్పున, 20 గొర్రెలు, మేకలు ఉంటే ఒకటి చొప్పున హెల్త్ కార్డు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 1.52 లక్షల పశువైద్య కార్డులు పంపిణీ చేశారు. ఇందులో రైతు పేరు, ఊరు, వైద్య సేవలు అందించే వైద్యుల వివరాలు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. జీవాలకు తరచూ వచ్చే రోగాలు, అందించిన చికిత్సలు అందులో పొందుపరుస్తారు. ఆరోగ్య సంరక్షణ చర్యలు, కృత్రిమ గర్భధారణ తదితర వివరాలు నమోదు చేస్తారు. భవిష్యత్తులో ఎప్పుడైనా రోగాల బారిన పడితే వాటి గత చరిత్ర తెలుసుకోవడం ద్వారా సులువుగా వైద్య మందించేందుకు వీలు కలుగుతుంది. హెల్త్ కార్డులో పశువులు/జీవాలకు వచ్చే రోగాలు, నివారణ చర్యలు కూడా ముద్రించి ఉండడంతో రైతులే సొంతంగా జీవాలకు మందులు అందించి ఉపశమనం పొందవచ్చు.

వైఎస్సార్ పశు బీమాతో ధీమా

ఏదైనా వ్యాధి, ప్రకృతి వైపరీత్యాల కారణంగా జీవాలు మృతి చెందితే వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా ప్రభుత్వం పరిహారం అందిస్తోంది. జిల్లాలో 2019 నుంచి 7,260 పశువులు మృత్యువాత పడగా, రూ.3,89,65,500 దాకా పరిహారం అందించారు. సంకర జాతి, మేలు జాతి పశువులకు రూ.30 వేలు, దేశవాళీ పశువులకు రూ.15 వేలు అందజేస్తున్నారు. రూపాయి తీసుకోకుండానే ఇన్సూరెన్స్ చేయిస్తుండడం గమనార్హం.

మంచి కార్యక్రమం



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు రైతులందరికీ ఎంతో ఉపయోగపడుతుంది. పశువులు, గొర్రెల వైద్యం, వైద్యుల వివరాలు తెలుసుకునే వీలుంది. రైతులందరికీ పంపిణీ చేస్తున్నారు. అన్ని సేవలు ఉచితంగా పొందుతున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు ఇబ్బందులు తప్పాయి.

– వెంకటేసు, గొర్రెల కాపరి, పెదపల్లి

ఒక్క ఫోన్ కాల్ చాలు



పశువులకు నష్టం వాటిల్లినా, అనారోగ్యం చేసినా ఒక్క ఫోన్ కాల్ దూరంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వం అమూల్ సంస్థ ద్వారా పాల సేకరణ చేస్తున్నప్పటి నుంచి పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి.

– లక్ష్మీపతి, పాడిరైతు, సుబ్బరాయనిపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో 33 మంది వైద్యులు, ప్రతి ఆర్‌బీకేలో వైద్య సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలి. పశువుల హెల్త్ కార్డులు భద్రంగా ఉంచుకోవాలి. కార్డుల ద్వారా జీవాలకు అందించే వైద్యం గురించి తెలుసుకోవచ్చు. రైతులే సొంతంగా మందులు అందించవచ్చు.

– శుభదాస్, జిల్లా పశువైద్యాధికారి

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'స్పందన' ఉంటుంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

ఐసీడీఎస్‌లో సంచుల కొనుగోలుకు టెండర్లు

ప్రశాంతి నిలయం: సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఐసీడీఎస్ లబ్ధిదారులకు ఇంటి వద్దకు రేషన్, ఇతర పోషకాహారాలను చేరవేసేందుకు అనువైన సంచుల కోసం సరఫరాదారుల నుంచి టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా మహిళాశిశు అభివృద్ధి మరియు సాధికారిత కార్యాలయం పేరిట రూ.5వేలు డీడీ తీసి ఈ నెల 18 సాయంత్రం 5 గంటల్లోపు సీల్డ్ టెండరు దాఖలు చేయాలి. 19న ఉదయం కలెక్టరేట్‌లో టెండర్లు తెరిచి, అర్హులను ఎంపిక చేస్తారు.

22న జాతీయ గణిత దినోత్సవం

కదిరి: భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణ కో-ఆర్డినేటర్ ఎస్. వెంకటస్వామి ఆదివారం పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవ ప్రాధాన్యతపై జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

పేదలకు పెద్దమేలు



కోర్టు వివాదం ముగిసిన స్థలాలకు పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ (ఫైల్)

ఉరవకొండ: నివేశన స్థలాల కోసం అనేక ఏళ్లగా నిరీక్షిస్తున్న పేదలకు జగన్ సర్కార్ ఊరట కలిగించింది. కోర్టు వివాదంలో ఉన్న స్థలాలను క్లియరెన్స్ చేసి పట్టాలు మంజూరు చేసింది. సొంతింటి కల సాకారానికి బాటలు వేసింది. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసంతో ఆశలు వదులుకున్న పేదలు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరగడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

టీడీపీ హయాంలో మోసం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 సార్వత్రిక ఎన్నికల వేళ ఓట్ల కోసం గిమ్మిక్కులు చేశారు. ఏకంగా 15 సర్వే నంబర్లు పొందుపరచి.. హద్దులు పేర్కొనకుండానే తయారు చేసిన ఇంటి పట్టాలను ఉరవకొండలో పేదలకు పంపిణీ చేశారు. పేదలకు పట్టాలు తన ఘనతేనంటూ పయ్యావుల కేశవ్ పబ్లిసిటీ చేసుకున్నారు. కానీ అస్పష్టంగా ఉన్న ఆ పట్టాలన్నీ చెల్లవని తేలింది. తాము నిలువునా మోసపోయామని బాధితులు లబోదిబోమన్నారు. ఎన్నికల్లో పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ పేదల ఇంటి పట్టాల సమస్యను పట్టించుకోలేదు. విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాకు పరిమితమయ్యారు. పైగా నియోజకవర్గ టీడీపీ నేతలు పేదలకు స్థలాలు అందకూడదనే ఉద్దేశంతో సదరు సర్వే నంబర్ల భూయజమానులపై ఒత్తిడి తెచ్చి పరిహారం పెంచాలంటూ కోర్టులో కేసులు వేయించారు.

జగన్ సర్కారు చొరవ

ఉరవకొండలోని పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు చొరవ తీసుకుంది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హత కల్గిన వారందరికీ స్థలాల కేటాయింపునకు చర్యలు చేపట్టింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో ఉరవకొండ పట్టణంలో ఏకంగా 3,500 మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరయ్యాయి. ఇది ఒక రికార్డుగా చెప్పుకోవచ్చు. ఏళ్లుగా ఉన్న భూవివాదం హైకోర్టులో పరిష్కారమయ్యేలా శ్రద్ధ చూపడంతో తొలి విడతగా 560 ఇంటిపట్టాలను వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఇటీవలే పంపిణీ చేశారు. స్థలాలను కూడా చూపించారు. మిగిలిన వారికి కూడా పట్టాలు సిద్ధం చేశారు. వారికి త్వరలోనే అందించనున్నారు.

రైల్వే డివిజన్‌కు అవార్డుల పంట



శుభ్రత అవార్డు దక్కించుకున్న గుంతకల్లు రైల్వేస్టేషన్

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే వారోత్సవాల్లో భాగంగా ఏటా ప్రకటించే జోనల్ స్థాయి అవార్డుల్లో గుంతకల్లు డివిజన్‌కు పలు అవార్డులు దక్కాయి. 2022-23కు గాను స్టేషన్ల పరిశుభ్రత, ట్రాక్ మెయింటెనెన్స్, ఎల్‌సీ గేట్ల ఎత్తివేత, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపాలన, డీజిల్ షెడ్, వర్క్‌షాపు నిర్వహణ తదితర విభాగాల్లో అవార్డులు దక్కాయి. త్వరలో సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ భవన్‌లో జరిగే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జీఎం అరుణ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులను డివిజన్ అధికారులు అందుకోనున్నారు.

గుంతకల్లు డివిజన్‌కు దక్కిన అవార్డులు ఇవే...

- క్లీన్ మెయింటెనెన్స్ స్టేషన్‌గా గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు జీఎం షీల్డ్ దక్కింది.
- డీజిల్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ల నిర్వహణకు సంయుక్త జీఎం అవార్డులను గుంతకల్లు డివిజన్‌లోని గుత్తి డీజిల్ లోకో షెడ్డు, విజయవాడలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్ కైవశం చేసుకున్నాయి.
- బెస్ట్ ట్రాక్ మిషన్స్, ట్రాక్ మెయింటెనెన్స్‌కు గుంతకల్లు, సికింద్రాబాద్ డివిజన్లకు సంయుక్తంగా జీఎం అవార్డులు దక్కాయి.
- డివిజన్‌లోని రేణిగుంట జంక్షన్‌కు చెందిన ఏఆర్‌టీ వాహనానికి బెస్ట్ మెయింటెనెన్స్ వాహనంగా గుర్తింపు.
- ఉత్తమ వర్క్‌షాప్ అవార్డును తిరుపతిలోని మెకానికల్ వర్క్‌షాపు కైవసం చేసుకుంది.
- తిరుపతి-జమ్ముతావి-తిరుపతి (రైలు నం .22705/06) హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బెస్ట్ మెయింటెడ్ లాంగ్ డిస్టెన్స్ ట్రైన్స్ అవార్డు దక్కింది.

మొబైల్ వైద్య సేవలు విస్తరిస్తాం



మాట్లాడుతున్న రత్నాకర్ రాజు



సత్సంగ్‌లో పాల్గొన్న సత్యసాయి మొబైల్ వైద్య శాల సిబ్బంది

ప్రశాంతి నిలయం: సత్యసాయి మొబైల్ ఆస్పత్రి సేవలను భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తామని సత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు ప్రకటించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్న మొబైల్ ఆస్పత్రి సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఆయన కొనియాడారు. మొబైల్ ఆస్పత్రి 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సిబ్బందితో సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్నాకర్ రాజు మాట్లాడుతూ సత్యసాయి బోధనలు ఆదర్శంగా తీసుకుని లాభాపేక్ష లేకుండా పనిచేయడం గర్వకారణమన్నారు. సత్యసాయి మొబైల్ ఆస్పత్రి సేవలను 2006లో ప్రారంభించారని గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వస్తూ సేవలకు సహకరిస్తున్నారని చెప్పారు. మొబైల్ ఆస్పత్రి సంజీవని బస్సులో ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. రోగి ఆరోగ్య స్థితి మెరుగుపడే వరకూ సూచనలు, సలహాలు అందిస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మొబైల్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నరసింహన్, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యసిరి

ప్రజారోగ్యానికి జగన్ సర్కారు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఖరీదైన వైద్యాన్ని సైతం ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించి రోగులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందు కోసం ఇప్పటి వరకు ఉన్న వైద్య సేవల కోసం ప్రభుత్వం వెచ్చించే వ్యయాన్ని ఐదింతలు పెంచి సామాన్య ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తోంది.



ఆరోగ్య శ్రీ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు (ఫైల్)

- ప్రజారోగ్యానికి ప్రాధాన్యత
- ఆరోగ్యశ్రీ వ్యయం భారీగా పెంపు
- రూ.25 లక్షలకు పెరిగిన పరిమితి
- ఈ నెల 18న నూతన మార్గదర్శకాలు
- సర్కారు నిర్ణయంతో సామాన్యుల్లో మరింత ధైర్యం
- టీడీపీ హయాంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో మూడు రెట్లు పెరిగిన లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అందించే వైద్య సేవల వ్యయం త్వరలోనే భారీగా పెరగనుంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రీమియం త్వరలోనే భారీగా పెరగనుంది. మొన్నటి వరకు ఒక కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల దాకా ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయ పరిమితి ఇప్పుడు రూ.25లక్షలకు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 18న నూతన మార్గదర్శకాలు వెలువడనున్నాయి. దీంతో సామాన్యులు, పేదవాళ్లు, కూలీలు ఎవరైనా సరే ఎంత పెద్ద జబ్బు చేసినా ఉచితంగా వైద్యం పొందచ్చు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న ఈ పథకం ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్టు పాతిక లక్షల రూపాయల వ్యయ పరిమితికి చేరుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాజా అంచనాల ప్రకారం 44 లక్షల వరకు జనాభా ఉంది. ఇందులో వార్షికాదాయం 5 లక్షల లోపు ఉన్నవాళ్లందరూ లబ్ధిపొందచ్చు. ఈ లెక్కన

ఉమ్మడి అనంతలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వివరాలు ఇలా	
నెట్‌వర్క్‌లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు	56
వైద్యవిధానపరిషత్ ఆస్పత్రులు	22
ప్రభుత్వ సర్వజనాసుపత్రి	01
పీహెచ్‌సీలు	73
మొత్తం ఆరోగ్యశ్రీ కార్డులు	12,02,000
పథకం పరిధిలో ఉన్న చికిత్సలు	3,257
గడిచిన నాలుగేళ్లలో లబ్ధిదారులు	3,73,735
నాలుగేళ్లలో ఖర్చు చేసిన వ్యయం	రూ.673.02 కోట్లు
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	1,78,165
ఆసరా కోసం చేసిన వ్యయం	రూ.91.32 కోట్లు

ఉమ్మడి జిల్లాలో కనీసం 35 లక్షల మంది వరకూ లబ్ధి పొందే అవకాశం ఉంది.

పెద్ద జబ్బులొచ్చినా.. ఆందోళన వద్దు

చికిత్సలకు ఇచ్చే ప్రీమియం పెంచడం వల్ల ఇకపై పెద్ద పెద్ద జబ్బులొచ్చినా ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. ఒక్కోసారి క్యాన్సర్, బోన్‌మ్యారో వంటి జబ్బులకు రూ.15 లక్షల వరకు అవుతుంది. ఇలాంటి కేసుల్లో పేదవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై ఎంత పెద్ద జబ్బు వచ్చినా భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఆరోగ్య చికిత్సల్లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, బోన్‌మ్యారో, కాక్లియర్ ఇంప్లాంట్స్ వంటి ఖరీదైన జబ్బులు ఉచితంగానే జరుగుతున్నాయి. ఇకపై ఇంతకంటే ఎక్కువ వ్యయం అయినా ప్రభుత్వమే భరిస్తుంది. వ్యవసాయాధారిత జిల్లాగా పేరుపొందిన ఇక్కడ ఎక్కువగా వ్యవసాయ కూలీలే ఉన్నారు. వీరికి ఇప్పుడు సర్కారు మరింత భరోసా కల్పించినట్టయింది.

పెరిగిన లబ్ధిదారుల సంఖ్య

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గతంలో ఏటా 25 వేలకు మించి ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు నమోదయ్యేవారు కాదు. కానీ గడిచిన నాలుగేళ్లలో సగటున ఏడాదికి 95 వేల మంది ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స చేయించుకున్నారు. చికిత్సల సంఖ్య 1,059 నుంచి 3,257కు పెంచడంతో అన్ని జబ్బులకూ వైద్యం లభిస్తోంది. దీనికి తోడు ఇప్పుడు ప్రసవాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంలో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క గర్భిణులే ఏటా 40వేల మందికి పైగా ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. అంతేకాదు కోలుకునే సమయంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.5వేలు పొందుతున్నారు. దేశ చరిత్రలో ఏపీలోనే ఇలాంటి పథకం అమలవుతోంది.

పెద్ద జబ్బులకూ ఉచిత చికిత్స

ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఇప్పటికే అన్ని రకాల పెద్ద పెద్ద జబ్బులకూ వైద్యం లభిస్తోంది. సర్కారు తాజా నిర్ణయంతో ఎంత పెద్ద జబ్బుకైనా చికిత్స చేయించుకునేందుకు అర్హత లభిస్తుంది. దీంతో ప్రాణాపాయ జబ్బు వచ్చినా సామాన్యులు భయపడాల్సిన పనిలేదు. – **డా.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్**

ఖాద్రీశా.. కరుణించు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం స్వాతినక్షత్రం కావడంతో స్వామివారి జన్మదినం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుని రకరకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాతోపాటు చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఖాద్రీశుని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

విద్యుదాఘాతం.. బాలురకు తీవ్రగాయాలు


గాయపడిన దీక్షిత్

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరంలోని రామ్‌నగర్‌కు చెందిన దీక్షిత్ (3వ తరగతి), ధర్మతేజ (5వ తరగతి) స్నేహితులతో కలసి ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడుకుంటుండగా బంతి నేరుగా వెళ్లి ఓ ఇంటి బాత్‌రూంపై పడింది. దీంతో దీక్షిత్, ధర్మతేజ మిద్దె ఎక్కి కడ్డీ సాయంతో బంతిని తీస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురయ్యారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అనుమానాస్పద మృతి


భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ధర్మవరం రూరల్: మండలంలోని పోతులనాగేపల్లికి చెందిన కొంగ్రెడ్డి భాస్కరరెడ్డి (24) అదే గ్రామ సమీపంలోని వంకలో ఆదివారం మృతదేహమై కనిపించాడు. వివరాలు... గ్రామానికి చెందిన అంజినమ్మ, నారాయణరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండో కుమారుడు భాస్కర్‌రెడ్డి గ్రామ సమీపంలోని పొలాల వద్దకు మూడు రోజుల క్రితం పశువులను మేపు కోసం తీసుకెళ్లాడు. శుక్రవారం సాయంత్రం పశువులు మాత్రమే ఇంటికి వచ్చాయి. భాస్కర్‌రెడ్డి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. రెండు రోజులుగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం వంకలోని నీటిలో భాస్కరరెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమారుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు మోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వజ్రకరూరు: మండలంలోని గూళ్లపాళ్యం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న వజ్రకరూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. 48 సంవత్సరాల వయసు ఉంటుందని, టీషర్టు, నీలం రంగు డ్రాయర్ ధరించినట్లు వెల్లడించారు. కుడిచేతికి గాయమైన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. వ్యక్తి మృతదేహాన్ని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా సాక్షి మ్యాథ్స్–బీ

- మేధస్సుకు పదును పెట్టిన పరీక్ష
- ప్రయోజనకారిగా ఉందంటున్న ఉపాధ్యాయులు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల మేధస్సుకు పదును పెట్టేలా 'సాక్షి' మ్యాథ్స్–బీ, స్పెల్–బీ టాలెంట్ సెర్చ్ పరీక్ష ఉత్సాహంగా సాగింది. అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వేదికగా ఆదివారం సాగిన ఈ పరీక్షకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. మొత్తం నాలుగు కేటగిరీల్లో విద్యార్థులు పోటీ పడ్డారు. 1వ కేటగిరీలో 1, 2 తరగతులకు చెందిన 14 మంది విద్యార్థులు, రెండో కేటగిరీలో 3, 4వ తరగతులకు చెందిన 10 మంది, 3వ కేటగిరీలో 5, 6, 7 తరగతులకు చెందిన 15 మంది, 4వ కేటగిరీలో 8, 9, 10 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా స్థాయి విజేతలు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పరీక్షా కేంద్రాన్ని సాక్షి యాడ్స్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం ఆశాసుల్తానా తదితరులు పర్యవేక్షించారు. కాగా, 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ సెర్చ్ పోటీలు విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా ఉన్నాయని పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.





స్పీడ్ థింకింగ్ పెరుగుతుంది



ప్రస్తుతం నేను థర్డ్ స్టాండర్డ్ చదువుతున్నా. ఇంతకు ముందు ఈ పరీక్ష రాసిన మా సీనియర్స్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ సారి నేనూ స్పెల్–బీ పరీక్ష రాశాను. ఇందు కోసం ప్రత్యేకంగా మా టీచర్ సాధన చేయించారు. చాలా వరకూ థింకింగ్ లెవల్స్ పెరుగుతాయని అందరూ అంటున్నారు కాబట్టి ఇకపై రెగ్యులర్‌గా ఇలాంటి పోటీ పరీక్షలకు హాజరవుతా. – అర్ఫాసారా, విద్యార్థిని

రెండు సార్లు స్టేట్ లెవల్‌కు వెళ్లా..



విశ్వభారతి స్కూల్లో ఇప్పటి వరకూ జరిగిన చాలా పోటీ పరీక్షల్లో నేను పాల్గొన్నాను. స్పెల్–బీ, మాథ్స్–బీలో రెండు సార్లు స్టేట్ లెవల్ వరకూ వెళ్లాను. గతంతో పోల్చుకుంటే ఈ తరహా పరీక్షల వల్ల మ్యాథ్స్‌పై నాకున్న భయం పూర్తిగా పోయింది. ప్రస్తుతం నేను వేగంగా ఎలాంటి లెక్కలైనా చేయగలుగుతున్నా. – గురు చరణ్‌సాయి, 10వ తరగతి

మ్యాథ్స్ అంటే క్వీన్ ఆఫ్ సబ్జెక్ట్స్

సాక్షి మీడియా వారు స్పెల్–బీ, మాథ్స్–బీ పరీక్షల నిర్వహణకు ఎక్కువగా మా పాఠశాలనే ఎంపిక చేస్తుండడం సంతోషదాయకం. అనేకసార్లు మా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల వరకూ వెళ్లారు. గతంలో రెండు సార్లు చాంపియన్‌షిప్‌నూ దక్కించుకున్నాం. మ్యాథ్స్‌ను క్వీన్ ఆఫ్ సబ్జెక్ట్స్ అంటారు. భవితను వేగంగా తీర్చిదిద్దుకునేందుకు పునాదిగా, క్రమశిక్షణకు ప్రయోజకారిగా మ్యాథ్స్ నిలుస్తుంది. – ఆశా సుల్తానా, హెచ్‌ఎం, విశ్వభారతి పాఠశాల

జూదరుల అరెస్ట్

- రూ. 3 లక్షలు నగదు, 25 ద్విచక్రవాహనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న జూదరుల వాహనాలు

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామ సమీపంలోని ఓబుళాపురం చెరువు వద్ద పేకాట ఆడుతున్న 21 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.3 లక్షలు నగదు, 20 సెల్‌ఫోన్లు, 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్, రూరల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపి, సిబ్బంది గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చెరువు వద్ద భారీగా వాహనాలు కనిపించడంతో అక్కడకు వెళ్లి పరిశీలిస్తే భారీ మొత్తాన్ని వెచ్చిస్తూ పేకాట ఆడుతున్న 21 మంది పట్టుబడ్డారు. పోలీసుల రాకను గమనించిన ఏడుగురు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

అనంతపురం కల్చరల్: 'ఏడు కొండలవాడా వేంకటేశ్వరా.. గోవిందా గోవిందా' అంటూ భక్తుల శరణుఘోషతో నగరంలోని ఆర్‌ఎఫ్‌రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. ఆదివారం గోవిందమాల బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రధాన అర్చకులు హరికిషోర్ శర్మ, గోపిశర్మ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పరిణయ ఘట్టాన్ని నేత్రపర్వంగా జరిపించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ, ఎరురుకోళ్లు, సప్తపది ఘట్టాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం నారాయణసేవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనవాక్కు

మా బిడ్డను చదివించుకుంటున్నాం



కరోనాకు ముందు ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లి నా భర్త శివప్రసాద్ ప్రైవేట్ వాహనాలకు డ్రైవర్‌గా, నేను హోటల్‌లో కూలి పనికి వెళ్లేవాళ్లం. మాకు ఇద్దరు కుమార్తెలు. కరోనా కారణంగా సొంతూరికి తిరిగి వచ్చాం. అప్పటి నుంచి ఇక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా పెద్ద కుమార్తెకు ఎలాంటి సర్టిఫికెట్లు లేకపోవడంతో బడిలో చేర్పించలేకపోయాం. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ నేరుగా వచ్చి వివరాలు తీసుకెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో జనన ధ్రువీకరణ పత్రం ఇప్పించాడు. ఇవి పొందడానికి గతంలో మేము ఎన్ని తిప్పలు పడ్డామో ఆ దేవుడికే తెలియాలి. ఒక్క పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు మంజూరు చేసి, మా కుమార్తెను ఆరో తరగతిలో చేర్పించేందుకు మార్గం సుగమం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడ్డాం. – నాగవేణి, అంబేడ్కర్ కాలనీ, బత్తలపల్లి

పింఛనే ఆధారం



వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించే మాకు వృద్ధాప్యం కారణంగా పనులు చేయలేక పోతున్నాం. గతంలో నా భార్యకు రెండు కళ్లు సరిగా కనపడక పోవడంతో ఆపరేషన్ చేయించా. అది కాస్త ఫెయిల్ అయింది. సీఎంగా వైఎస్ జగన్ వచ్చిన తర్వాత నాకు రూ.2,750, నా భార్యకు రూ.3వేలు పింఛన్ అందుతోంది. ఈ డబ్బుతో ఎవరి మీద ఆధారపడకుండా మేము హాయిగా జీవిస్తున్నాం. మాలాంటి నిర్భాగ్యులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాం. – ఖాదర్, షకీనా దంపతులు, టి.రెడ్డివారిపల్లి, తలుపుల మండలం

ఈ ఇల్లు జగనన్న వరప్రసాదం



నేను టైలరింగ్‌తో, నా భర్త షరాబ్ యోగానందాచారి బంగారు దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. 20 ఏళ్లుగా బత్తలపల్లిలోనే ఉంటున్న మాకు సొంతిల్లు ఉండేది కాదు. స్థలం కొందామంటే ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో రూ.4లక్షలు విలువ చేసే ఇంటి స్థలం మంజూరైంది. ఇప్పుడు మేముంటున్న ఇల్లు ఆ స్థలంలో కట్టుకున్నదే. ఇది ఆ జగనన్న వరప్రసాదంగా భావిస్తున్నాం. – షరాబ్ భవాని, బత్తలపల్లి

రూ.2 లక్షలకు పైగా లబ్ధి పొందా



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.2 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. ఇంటి స్థలం ఉండగా పక్కా గృహం కట్టించి ఇచ్చారు. జనానికి మంచి చేసే జగనన్న మరో పది కాలల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నా. – సవిత, కల్లూరు, లేపాక్షి మండలం

ఆధ్యాత్మిక మార్గంలోనే ఉన్నత జీవితం

- ఇస్తెమాలో ప్రసంగించిన పలువురు మత పెద్దలు
- ఘనంగా తెహరికె ఫైజానే ఉమర్ ఫారుక్ వార్షికోత్సవం


ఇస్తెమాకు హాజరైన అనంతపురం నగర మేయర్ వసీం



ఇస్తెమాలో మాట్లాడుతున్న దావణగెరికి చెందిన బాబా ఫకృద్దీన్

అనంతపురం కల్చరల్: ధ్యాత్మిక మార్గం ఏ వయస్సు వారికైనా ఉత్తమ జీవితాన్ని ప్రాప్తింపజేస్తుందని పలువురు మత పెద్దలన్నారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ 14వ వార్షికోత్సవ సున్ని ఇస్తెమా ఆదివారం ఘనంగా జరిగింది. తెహరిక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ నేతృత్వంలో స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఇస్తెమాలో భూసావల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్, కర్ణాటక నుంచి నాసిర్ రజాఖాన్ ముఖ్య ప్రసంగీకులుగా నగరానికి విచ్చేసి, దైవమార్గం విశిష్టతను వివరించారు. యువత తమ గమ్యాన్ని మరిచిపోయి ఫ్యాషన్ ఒరవడిలో తప్పుదోవ పడుతోందన్నారు. ఆచారాలు పాటించడం ద్వారా ఉత్తమ సమాజ గతిని మార్చడానికి కృషి చేయాలని సూచించారు. వేలాదిగా తరలి వచ్చిన ముస్లింలకు ఇతర సౌకర్యాలతో పాటు ప్రత్యేకంగా భోజన వసతి కల్పించారు. సాయంత్రం ప్రముఖ న్యూరో ఫిజీషియన్ కృష్ణకాంతరెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్త (స) ధరించిన దుస్తులు, పవిత్ర కేశాలు భక్తుల సందర్శనార్థం ఉంచారు. మేయర్ వసీం, కార్పొరేటర్లు జనబలం బాబా, రహంతుల్లా, సైఫుల్లాబేగ్ తదితరులు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరుదుద్దీన్, పర్వేష్, షబ్బీర్ అహమద్, హబీబ్, డాక్టర్ షఫీ, మహబూబ్ బాషా, హుస్సేన్ పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య


మృతుడు వినయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: తల్లిదండ్రుల మందలింపుతో మనస్తాపం చెందిన ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన గంటల మారెమ్మ ఆలయ పూజారి నాగరాజు, కల్పన దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడు వినయ్‌కుమార్ (12) పెడపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయంలో పూజాదికాలు నిర్వహణకు వెళ్లేందుకు సిద్ధమైన నాగరాజు... నిద్రిస్తున్న వినయ్‌కుమార్‌ను లేపి ద్విచక్ర వాహనంపై తల్లిని, అవ్వను ఆలయం వద్ద విడిచి రావాలని పురమాయించాడు. నిద్ర లేవకుండా ఆలస్యం చేయడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద కుమారుడు గోపీచంద్ నిద్రలేచి అమ్మను, అవ్వను ద్విచక్రవాహనంపై పిలుచుకెళ్లి ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన వినయ్‌కుమార్... నెలరోజుల క్రితం గృహ ప్రవేశం చేసిన ఇంట్లోకి వెళ్లి లోపల గదిలో కొక్కేనికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూజాదికాలు ముగిసిన తర్వాత అందరూ ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు ఎంత సేపు పిలిచినా తలుపు తీయకపోవడంతో వెనుక ఉన్న కిటికీ అద్దాలు పగులగొట్టి పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న వినయ్‌కుమార్‌ను చూసి, వెంటనే తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. శరీరం కొంత వేడిగా ఉండడం గమనించిన స్థానికులు వెంటనే కారు ఏర్పాటు చేయడంతో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనపై ఎస్‌ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాయల్టీ అధికారులమంటూ బెదిరింపులు

రాప్తాడు రూరల్: రాయల్టీ అధికారులమంటూ బెదిరించి డబ్బు గుంజేందుకు ప్రయత్నించిన దుండగులు చివరకు పోలీసులు పట్టుబడ్డారు. వివరాలు... తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఓ ట్రాక్టర్ ఈ నెల 8న కళ్యాణదుర్గం వైపు నల్ల బండల లోడుతో వెళుతుండగా రాత్రి 11 గంటలకు అనంతపురం రూరల్ మండలం కురుగుంట దాటగానే సంతోష్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు అటకాయించారు. తాము రాయల్టీ అధికారులమంటూ డ్రైవర్‌ను బెదిరించారు. భయపడిన డ్రైవర్ ట్రాక్టర్ దిగడంతో దుండగుల్లో ఒకరు ట్రాక్టర్ ఎక్కి పక్కకు పెట్టే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో చాలా బండలు విరిగిపోయాయి. ఇంతలో దుండగులు డ్రైవర్‌ను బెదిరించి సెల్‌ఫోన్, డబ్బులు లాక్కొన్నారు. అటుగా వెళ్తున్న కొందరు అనుమానం వచ్చి సమాచారం అందించడంతో రూరల్ పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని దుండగులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురూ చిన్నంపల్లి పంచాయతీ సజ్జలకాలవ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. నిందితులపై సీఐ రామకృష్ణారెడ్డి న్యూసెన్స్ కేసు నమోదు చేసి, బాధితుడికి నష్టపరిహారం ఇప్పించారు.

'దుర్గం'లో చైన్ స్నాచింగ్

కళ్యాణదుర్గం: కాలినడకన వెళుతున్న ఓ వివాహిత మెడలోని బంగారు మాంగ్యలంచైన్‌ను దుండగుడు లాక్కెళ్లాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గంలోని ఆర్టీసీ బస్టాండ్ కాలనీలో నివాసముంటున్న ఉష.. ఆదివారం ఉదయం తన స్నేహితురాలితో కలసి పంపనూరు క్షేత్రానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వేకువజామునే ఇంటి వద్ద నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన వారిని వెంబడిస్తూ వచ్చిన దుండగుడు.. నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే వెనుక నుంచి ఉష మెడలోని మూడు తులాల బరువైన బంగారు మాంగల్యం చైన్‌ను లాక్కొని వడ్డే కాలనీ వైపు పరుగు తీశాడు. బాధితురాలు వెంటనే డయల్ 100కు సమాచారం అందించడంతో కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని ఆ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు పుష్పలత

పెనుకొండ రూరల్: సంతానం కలుగక పోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన పుష్పలత (30)కు గుట్టూరు నివాసి మహేంద్రతో పదేళ్ల క్రితం వివాహమైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో గుట్టూరు పంచాయతీ 1వ వార్డు సభ్యురాలిగా గెలుపొందింది. అయితే పెళ్లై పదేళ్లు గడిచినా సంతానం కలుగక పోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆమె శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం వేకువజామున ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

గుత్తి రూరల్: పొలానికి వెళ్లేందుకు దాయాదులు దారి విడువక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం రాంపురానికి చెందిన ఆదినారాయణ, సావిత్రమ్మ దంపతుల రెండోకుమారుడు కాయల రామచంద్ర (26)కు సమీప బంధువులతో పొలం రస్తా విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గుత్తి మండలం కొత్తపేట సమీపంలో తనకున్న మూడు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటను తొలగించి దిగుబడిని ఇంటికి తరలించేందుకు రామచంద్ర సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న దాయాదులు రస్తాకు అడ్డు వేయడంతో మూడు రోజులుగా ఎద్దులబండి అక్కడే ఆగిపోయింది. ఆదివారం మరోసారి దాయాదులతో రామచంద్ర మాట్లాడాడు. అయినా వారు ఒప్పుకోలేదు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రామచంద్ర నేరుగా ఇంటికెళ్లి పురుగుల మందు డబ్బా తీసుకుని పొలం వద్దకు చేరుకుని తాగాడు. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రామచంద్రను గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రామచంద్ర మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పంపనూరులో పూజలు


విశేష అలంకరణలో దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ముందుగా పంచామృతాభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గో ఆదివారం కావడంతో ఆలయంలో సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం జరిగింది. స్వామికి బంగారు కవచ సేవ, ఆకుపూజ, అర్చన మహా నైవేద్యం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ స్వామికి బంగారు కవచాన్ని ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయం బయట పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


కోడూరు జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు


ఎస్‌కే యూపీ పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరు థామస్ మన్రో తోపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల చదువుకునే రోజుల్లో తమకున్న జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. రోజంతా ఆట పాటలతో సరదాగా గడిపారు.

హిందూపురం టౌన్: స్థానిక శ్రీకంఠపురంలోని ఎస్‌కేయూపీ పాఠశాలలో 1983–84 బ్యాచ్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్ల తరువాత పాఠశాలలో దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.